
**‘అరుంధతి’ సినిమా గుర్తుందా...? అందులో తన జేజమ్మ చిత్రపటాన్ని చూస్తూ.. ఆ పటంలో ఆమెకు సంబంధించిన చరిత్రను చదువుతూ కనిపిస్తుంది అరుంధతి. చిత్రపటాల్లో చరిత్ర రాయడం ఒక అద్భుతమైన కళ. దాని పేరు ఐకోనోరైటింగ్. అలాంటి కళను ఉపయోగించి పన్నెండేళ్ల క్రితమే మన కడప జిల్లా వాడైన జె.రాబిన్‌సన్. తన తాతతండ్రుల చిత్రాలలో వారి జీవిత చరిత్రను పొందుపరిచారు. ముందు తరాల వారికి తెలియాలన్న సంకల్పంతో ఆ పనిచేశారాయన. ఆ నైపుణ్యమే ఇప్పుడో కొత్త తరహా విద్యావిధానానికి నాంది పలికింది. కేంద్రప్రభుత్వం సైతం దానిని గుర్తించింది. మలేషియా, థాయ్‌లాండ్, జపాన్‌లకు చెందిన విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు ఈ ప్రక్రియను అమలు చేయడంతోపాటు పరిశోధనలూ జరుపుతున్నాయి.**



# పిల్లలూ... బొమ్మలరాతను నేర్పుతాడీ అంకుల్!

జె.రాబిన్‌సన్ అసలు పేరు జింకా శ్రీనివాసులు. తన కుమార్తె స్నేహితురాలి పుట్టినరోజు కోసం ప్రత్యేక బహుమతి ఇవ్వాలన్న ఆలోచనే ‘ఐకోనో రైటింగ్’కు పురిగొల్పింది. ఈ ప్రక్రియ ద్వారా కాగితాన్ని పొదుపు చేయడంతో పాటు, విద్యాభ్యాసం పట్ల పిల్లల్లో ఆసక్తిని రేకెత్తించవచ్చంటున్నారు రాబిన్‌సన్.

## ఐకోనో రైటింగ్ అంటే...!

‘‘చదువుతూ రాయడానికి బదులు రాస్తూ చదవడం దీని ప్రత్యేకత. పిల్లలకు చదువు చెప్పాలంటే ఒక వస్తువును పరిచయం చేసి, దాని ద్వారా రాయడం, చదవడం నేర్పుతాం. ప్రస్తుత విద్యా విధానంలో చిన్న పిల్లలకు రెండు రూళ్లు, నాలుగు రూళ్ల పేపర్లు పెట్టి అక్షరాలను అరగదీయిస్తున్నారు. పిల్లలకు ఇష్టం లేకున్నా, వారిని బుజ్జగించి, బ్రతిమాలి, అవసరమైతే దండించి మరీ వారి చేత రాయిస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. పిల్లలు తమంతట తామే స్వచ్ఛందంగా రాసేలా వారిలో ఆసక్తిని కలిగించాలి. అది ఐకోనోతోనే సాధ్యం అవుతుంది. ఒక పేపర్ మీద పెన్నుతోనో, పెన్సిల్‌తోనో బొమ్మ లేస్తాం. లైన్లు గీస్తాం. వాటిపై అక్షరాలు రాయిస్తాం. ఉదాహరణకు- యాపిల్ బొమ్మ వేశామనుకోండి. దాని లోపలి భాగంలో లైన్లు గీసి ‘ఎ’ రాయాలని చెబుతాం. విద్యార్థి ఆ పండు బొమ్మను నింపాలన్న ఉద్దేశంతో మన ప్రమేయం లేకుండానే ఇష్టపూర్వకంగా రాస్తాడు. ఆ పద్ధతిని ‘పాజిటివ్ రైటింగ్ మెథడ్’ అంటాం. తర్వాత బొమ్మ వెలుపలి భాగంలో ‘ఎ’ రాయాలి. దాన్ని ‘నెగెటివ్ రైటింగ్ మెథడ్’ అని పిలుస్తారు. మూడో పద్ధతిలో బొమ్మ లోపలా, బయటా రాయాలి. దీనినే ‘కాంబో’ లేదా ‘ఐకోనో రైటింగ్ మెథడ్’ అంటారు. ఇలా బొమ్మలను నింపుతూ రాయడం వల్ల విద్యార్థికి అభ్యాసం పట్ల మక్కువ కలుగుతుంది. ఇందులో రంగుల పెన్సిళ్లను వాడొచ్చు. సాధారణంగా అందరూ వాడే.. బ్లూ కలర్ ఇంక్‌ను వాడాలన్న నిబంధనేమీ లేదు. విద్యార్థికి ఏ రంగు నచ్చితే దాన్ని వాడుకోవచ్చు.

## కాగితం ఆదా..

ఐకోనో రైటింగ్‌తో కాగితాన్ని పొదుపు చేయవచ్చు. మీరు గమనించారో లేదో, ఏదేని నోటు పుస్తకంలోని కాగితంలో కొంతభాగాన్నే మనం ఉపయోగిస్తాం. మిగతా పేపరంతా వృథా అవుతుంది. ఐకోనోలో అలా ఉండదు. రైటింగ్‌తోనే ఒక పేపరు మీద బొమ్మ వేస్తాం. ఆ బొమ్మలోనే చిత్రానికి సంబంధించిన చరిత్రను తెలియజెప్పడం దీని ప్రత్యేకత. అందరికీ అర్థమయ్యేలా చెప్పాలంటే- ఒక కాగితం మీద గాంధీజీ బొమ్మను వేశామనుకోండి. ఆయన జీవితంలోని ప్రధాన ఘట్టాలను ఆ బొమ్మలో రాయవచ్చు. దీనివల్ల బాపూజీ బొమ్మ మనసులో ముద్రపడిపోతుంది. దీంతో పిల్లల్లో విజ్ఞానంతోపాటు కళాతృష్ణ పెరుగుతుంది.

ఇక మన కుటుంబీకుల బొమ్మను గీసి, అదే పేపర్‌పై వారి చరిత్ర కూడా రాశామనుకోండి. అది భవిష్యత్ తరాలకు పనికొస్తుంది. తాత, ముత్తాతల గొప్పదనం, వంశచరిత్ర తెలుస్తుంది.

ఇంకొక విషయం.. పాఠశాలల్లో విద్యార్థులకు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఇస్తుంటారు. క్రికెట్ సర్టిఫికెట్ అనుకోండి. అందులో విన్నర్ అనో, రన్నర్ అనో.. నాలుగు లైన్లు తప్ప మరేమీ వుండదు. పేపరంతా ఖాళీగా కనిపిస్తుంది. అదే ఖాళీ ప్రదేశంలో క్రికెట్ చరిత్రను లిఖిస్తే ఏదో ఒక సమయంలో ఆ విద్యార్థి దాన్ని చదవకపోడు. క్రికెట్ చరిత్ర తెలియకపోదు. ఐకోనో విధానంలో 1 నుంచి 6వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 7 నుంచి 10వ తరగతి వరకు ఇంటర్‌మీడియట్, కాలేజీకి అడ్వాన్స్‌డ్ లెవల్ అని మూడు విభాగాలు వుంటాయి.

## ఎలా కనుక్కొన్నారు..?

2000 సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న నా కూతురు క్యాథరిన్ ఓ రోజున నావద్దకు వచ్చి.. తన స్నేహితురాలి పుట్టిన రోజుకి ఏదైనా బహుమతి కావాలని, అది చాలా ప్రత్యేకంగా వుండాలని మరీమరీ కోరింది. ఏం చేయాలో నాకేం పాలుపోలేదు. చిన్నప్పటి నుంచీ నాకు ప్రయోగాలన్నా, కొత్త వస్తువు తయారు చేయాలన్నా చాలా ఇష్టం. దాంతో బుర్రకు పదును పెట్టాను. మొదట జీసెస్ బొమ్మ గీశాను. అందులో బైబిల్‌లోని రెండు అధ్యాయాలను లిఖించాను. అది చూసి మా అమ్మాయి ఎగిరిగంతేసింది. పుట్టిన రోజుకి ఇంకా సమయం వుండడంతో ఆ బొమ్మను గోడకు వేలాడదీశాను. బొమ్మలోని బైబిల్ చాప్టర్లు చదువుకోవడానికి ఓ భూతద్దం కూడా కొని పక్కనే వేలాడదీశాను. మా అమ్మాయితో పాటు ఇంటికొచ్చిన ఆమె స్నేహితులు ఆ బొమ్మను చూసి ఆకర్షితులయ్యారు. భూతద్దాన్ని తీసుకుని ఆసక్తిగా చదవసాగారు. రోజూ బైబిల్ చదవమని ఇంట్లోవాళ్లు పోరు పెట్టినా వినని పిల్లలు, పోటీపడి చదువుతుంటే నాకు ఆశ్చర్యం వేసింది. ఇదే ప్రక్రియను చదువులో కూడా ప్రవేశపెడితే బావుంటుంది కదా! అనిపించింది. ఆ ఆలోచనే నా పరిశోధనను పరుగులు పెట్టించింది.

## ప్రభుత్వాల ఆసక్తి..

ఏబీసీడీల నుంచి ఉన్నత చదువుల దాకా నేను ఐకోనో మీద పరిశోధనలు చేశాను. భిన్నమైన చార్టులు రూపొందించాను. మొదట ఆవడిలోని సిరగు మాంటిస్సోరి స్కూల్‌కు తీసుకెళ్లి యాజమాన్యానికి చూపించాను. అది వారికి ఎంతో నచ్చింది. దిగువ తరగతుల ఉపాధ్యాయులను పిలిచి నేను తయారు చేసిన వాటిని పరిశీలించాలని చెప్పారు. వారం రోజుల్లోనే ఫలితాలు వెలువడ్డాయి. ఉపాధ్యాయులు కూడా ఆశ్చర్యపోయారు. పిల్లలు ఎనలేని ఆసక్తి చూపుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. దాంతో నాకూ ఉత్సాహం వచ్చింది. ఇక్కడ మీకో విషయం చెప్పాలి. నేను ఈ ప్రక్రియను కనుక్కోవడానికి నా భార్య సహకారం ఎంతోవుంది. అన్ని పనుల్నీ వదిలేసి ఐకోనో మీద ప్రయోగాలు చేస్తూ కూర్చుంటే, అన్ని వ్యవహారాలను ఆమే చూసుకునేది. కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తుంది తను. ఐకోనో రైటింగ్ గురించి చెబుతూ అనేక చోట్ల తిరగాల్సి వచ్చింది. మొదట నిరాశ ఎదురైనా, తరువాత చాలామంది విద్యావేత్తలు ఆసక్తి చూపడం మొదలుపెట్టారు. ఓసారి కేంద్రీయ విద్యాలయం వారు నిర్వహించిన ‘టీచింగ్ మెథడాలజీ’ సదస్సులో పాల్గొనే అవకాశం వచ్చింది. అందులో బహుమతి కూడా వచ్చింది. మెల్లగా విషయం కేంద్రప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈ ప్రక్రియ మీద అందరికీ అవగాహన కల్పించాలని సంబంధితులకు ఉత్తర్వులు వెళ్లాయి.

## సదస్సుల కోసం ప్రయత్నం..

దక్షిణ భారతదేశంలో వెయ్యికి పైగా కేంద్రీయ విద్యాలయాలున్నాయి. వాటిల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాను. ప్రస్తుతం చెన్నయ్‌లోని కొన్ని స్కూళ్లలో ‘ఐకోనో రైటింగ్’ వాడుతున్నారు.


‘ఐకోనో రైటింగ్’ గురించి థాయ్‌లాండ్‌లో ఆ మధ్య ఒక అంతర్జాతీయ సదస్సు జరిగింది. అక్కడ ప్రముఖుల్ని కలుసుకునే అవకాశం దొరికింది. ‘జర్నల్ ఆఫ్ ఇండియన్ సైన్స్ అండ్ టెక్నాలజీ’ అచ్చువేసిన పుస్తకంలో ‘ఐకోనో రైటింగ్’ గురించి నేను రాసిన వ్యాసం ప్రచురించారు. జర్మనీకి చెందిన ‘రీడ్ ఎల్స్‌వేర్’ ప్రపంచవ్యాప్తంగా కొత్త విద్యా విధానాలకు ఇచ్చే బహుమతుల్లో ‘ఐకోనో రైటింగ్’కు ప్రథమ బహుమతి వచ్చింది. మలేషియాలోని సైన్స్ విశ్వవిద్యాలయంలో దీన్ని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టారు. మలేషియా ప్రభుత్వం కూడా ఈ ప్రక్రియ పట్ల ఆసక్తి చూపింది. ‘ప్యాటర్న్’ మార్చి ఇస్తే ప్రవేశపెడతామని మలేషియా ప్రతినిధులు అడిగారు. ఈ మేరకు ఒక ఒప్పందం కుదిరింది. అందుకోసం త్వరలోనే మళ్లీ అక్కడికి వెళ్తున్నాను. పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి కూడా ఓ ఆహ్వానం వచ్చింది. ముందు ఒప్పుకున్న పనులు పూర్తయితే, ఆ తరువాత పాక్ వెళ్తాను.

## పెద్ద చదువులు చదవకపోయినా...

కడప జిల్లా తాడిపత్రికి చెందిన పద్మశాలీల కుటుంబం మాది. మా తల్లిదండ్రులు జింకా వెంకటలక్ష్మి, జింకా మురళీ శంకరస్వామి. మా తాత జింకా ఆదినారాయణస్వామి 1915 నుంచి 1926 వరకు బ్రిటిషువారి హయాంలో ఆఫ్రికా ఖండంలోని ఉగాండాలో పోస్టుమాస్టర్‌గా పని చేశారు. ఆయన స్వదేశానికి వచ్చాక మా నాన్న రైల్వే ఉద్యోగం కోసం చెన్నయ్ వచ్చారు. అప్పటి నుంచి మేం ఇక్కడే వున్నాం. మా కుటుంబమంతా స్వరాష్ట్రానికి తిరిగి వెళ్లిపోయినా, నేను ఇక్కడే వుండిపోయాను. నాది మతాంతర వివాహం. భార్య హేమలత కోసం నేను మతం మారాను. అప్పుడే శ్రీనివాసరావుకు బదులు రాబిన్‌సన్‌గా పేరు మార్చుకోవాల్సి వచ్చింది. దీన్ని మా నాన్న తప్ప మిగతావారంతా వ్యతిరేకించారు. దాంతో దగ్గరి వాళ్లకు దూరమయ్యాను. చిన్నప్పటి నుంచీ నాకు పుస్తకాలు చదవడమంటే ఇష్టం. స్కూలు అయిపోగానే లైబ్రరీకి వెళ్లేవాడిని. రకరకాల ప్రయోగాలు చేసేవాడిని. పదో తరగతి తర్వాత ఐటీఐ చేశాను. తర్వాత ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజైనింగ్‌లో డిప్లమో చేశాను. నాకు చేసిన పని చేయడమంటే విసుగు. ఉదయాన్నే ఆఫీసుకు వెళ్లడం, చేసిన పనే చేస్తూ సాయంత్రానికి ఇంటికి చేరడం ఇష్టం ఉండదు. అందుకే చాలా ఉద్యోగాలు చేసినా సంతృప్తి లేక, వదిలేశాను. సొంతగా ఓ సంస్థ స్థాపించాను. అందులో నష్టం రావడంతో దానినీ వదిలేశాను. అన్నీ అయ్యాకే ‘ఐకోనో రైటింగ్’ను కనుక్కొన్నాను. ఈ విద్యను ఇప్పుడు దేశ, విదేశాలకు మరింత విస్తరించాలన్న పట్టుదలతో పనిచేస్తున్నాను..’’ అంటూ ముగించారు రాబిన్‌సన్.

రాబిన్‌సన్ ఫోన్ నెం. : **09884307219**

**– ఎస్‌కేఎండీ గౌస్‌బాషా,** చెన్నయ్
ఫోటోలు: కర్రి శ్రీనివాసులు



ఇలా అక్షరాలతో చిత్రాలు వేయవచ్చని చూపిస్తున్న రాబిన్‌సన్


ఐకోనో రైటింగ్‌తో వేసిన చిత్రాలు